క్లుప్తంగా

సబ్సిడీతో నాణ్యమైన విత్తన వేరుశనగ



విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ విజయకుమార్

కూడేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సబ్సిడీతో నాణ్యమైన విత్తన వేరుశనగను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏఓ విజయకుమార్ తెలిపారు. గురువారం ఉదిరిపికొండ రైతు భరోసా కేంద్రానికి కే-6 రకం విత్తన వేరుశనగ 200 క్వింటాళ్లు, కూడేరు రైతు భరోసా కేంద్రానికి 100 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. ఏఓ విత్తన నాణ్యతను పరిశీలించారు.కార్యక్రమంలో వీపీఏలు, వీహెచ్ఏలు జయప్రకాష్, సాజియా, నగేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందురీలు చేశారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న అధికారులు

విడపనకల్లు: ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీ కానుకలు గురువారం లెక్కించారు. 127 రోజులకు గాను రూ.22,84,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి రంగస్వామి నాయుడు, హనుమాన్ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పండ్ల మొక్కలు

కుందుర్పి: మండలంలో ఏర్పాటు చేసిన కుసుమగిరి ఎఫ్‌పీసీ సీఎస్‌సీ వారి సహకారంతో మండల రైతులకు ఉచితంగా వివిధ రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఆ సంస్థ మండల కోఆర్డినేటర్ నరసింహమూర్తి తెలిపారు. రైతులకు టేకు, చింతమొక్కలు, వేప,నేరేడు, కానుగ, శీషం తదితర మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు పట్టాదారుపాసుపుస్తకంతో పాటు ఆధార్ నకలుతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



వజ్రకరూరులో అలంకరణలో షిర్డీసాయి

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో పల్లకీ ఉత్సవం గురువారం సాయంత్రం కనుల పండువగా సాగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హార తులు నిర్వహించారు. మధ్యా హ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

జిల్లా వైద్య టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యటన



వెంకటాంపల్లిలో వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేసిన జిల్లా వైద్య టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

వజ్రకరూరు: మండలంలో జిల్లా వైద్యటాస్క్‌ఫోర్స్ కమిటీ గురువారం పర్యటించింది. వెంకటాంపల్లిలో ఉన్న హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేసింది. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించింది. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌లో సేవలపై ఆరాతీశారు. 2023 ఏప్రిల్‌నుంచి 2024 మార్చి వరకు మాతాశిశుసంరక్షణ పథకానికి సంబంధించి అందిన వివరా లు, సేవలపైనా ఆరాతీశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు గోవి ందగౌడ్, జరీనా, హేమలత, గంగాధర్, వైద్యధికారి సర్దార్ వలి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, హెచ్ఈ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు నాగశంకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంగారు సేద్యం.. పంటకు బలం

- ఖరీఫ్ సాగుకు రైతన్నలు సన్నద్ధం
- అనుకూలిస్తున్న ముందస్తు వర్షాలు
- పొలాలు దుక్కులు చేయడంలో నిమగ్నం



సేద్యం పనులు చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: ఇన్నాళ్లూ పల్లెల్లో సార్వత్రిక ఎన్నికల్లో తలమునకలైన రైతులు.. ఇటీవల కురిసిన వర్షాలకు పొలం బాట పట్టారు. త్వరలో ఖరీఫ్ ప్రారంభం కానుండడంతో దుక్కులు చేసుకోవడంలోనూ, ఎరువులు తరలించడంలోనూ బిజీగా ఉన్నారు. జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు ప్రకటన జారీ చేసింది. దీంతో ముంగారు సేద్యం పనులు ముమ్మరం చేశారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 1,30,383 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా, సాగు అంచనా సుమారు లక్ష హెక్టార్లు దాటొచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా డివిజన్‌లోని అన్ని మండలాల్లోనూ వర్షాధార పంటల్లో మెజార్టీ క్రాప్ వేరుశనగ సాగులోకి రాగా, పత్తి, ఆముదం, కంది, ఉలువ, అలసందులు, పెసలు, సజ్జ తదితర పంటలు సుమారు 5 వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉంది. దీనికి తగ్గట్టుగా అధికారులు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకునేలా ప్రణాళికలు చేపట్టారు.

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనం..

వేసవి దుక్కులు చేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. భూమిలోని వేడి బయటకు వెళ్లిపోతుంది. సూర్యరశ్మి ప్రవేశిస్తుంది. భూమి ఎండ వేడిమికి పగుళ్లబారి పంటలకు హానిచేసే క్రిమికీటకాలు చనిపోవటంతో పాటు కలుపు మొక్కలు పెరగకుండా అదుపులో ఉంటుంది. సాగు చేసిన భూమి ఎండిపోయి వర్షం కురిసిన వెంటనే నీరు నేలలోకి ఇంకిపోతాయి. దీంతో మొక్కలు ఏపుగా పెరిగేందుకు సరిపడా నీటి సాంద్రత లభ్యమౌతుంది. వేసవి దుక్కుల వల్ల కలుపు మొక్కలు తగ్గి భూసారం పెరిగి పంటకు బలం చేకూరుతుంది. విత్తన సాగు చేపట్టే ముందు నేలను రెండు, మూడు సార్లు దుక్కులు చేయడంతో వర్షం కురిసినప్పుడు భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండేందుకు ఆస్కారం ఉంటుంది.

రాయితీ విత్తనాలు సిద్ధం :

రైతు సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం రాయితీ విత్తనాలను ముందస్తుగా సిద్ధం చేసింది. రైతుకు ఏమేరకు అవసరం కానుందో అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేయించి, దానికనుగుణంగా నిల్వ సామర్థ్యం సమకూర్చింది. రాయదుర్గంలో సుమారు 25 వేలు, కళ్యాణదుర్గంలో సుమారు 30 వేల క్వింటాళ్లు ఈ సారి వేరుశనగ అవసరం కానుందని తేల్చారు. గతేడాది బహిరంగ మార్కెట్లో క్వింటా విత్తన వేరుశనగ విత్తన కాయలు రూ.9,300 కాగా, ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి రైతుకూ క్వింటా మీద రూ.3,720 రాయితీ ఇచ్చింది. దీంతో రూ.5,580 చెల్లించి రైతు విత్తన కాయ తీసుకెళ్లారు.

అడ్డుకున్న చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం అన్నదాతలనూ వదల్లేదు. ముందస్తు ముంగారుకు రైతన్నలు ఓ పక్క సిద్ధమవుతున్నారు. మరో పక్క రాయితీ విత్తనంపై సందిగ్ధత నెలకొంది. చంద్రబాబు ఫిర్యాదు కారణంగా ఎన్నికల కమిషన్ రాయితీ విత్తన పంపిణీకి బ్రేక్ వేసింది. ఎన్నికల ముగిసినా దీని పై ఎలాంటి క్లారిటీ లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రాయితీ విత్తనం అందకపోతే బహిరంగా మార్కెట్లో కొనుగోలు చేయడం సాధ్యం కాదని వాపోతున్నారు. ఈ విషయంపై ఈసీ పునారాలోచించుకొని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగు అంచనా, విత్తన కేటాయింపులు ఇలా..

నియోజకవర్గం	వేరుశనగ (క్వింటాళ్లు)	సాధారణసాగు (హెక్టార్లలో)	సాగు అంచనా
రాయదుర్గం	25,000	62,629	38,507
కళ్యాణదుర్గం	30,000	67,754	55,400

దుక్కులు చేసుకుంటున్నాం



పొలంలో వేసవి దుక్కులు చేసుకుంటున్నాం. ముందస్తు వర్షాలు ఊరిస్తుడడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు సమకూర్చే పనిలో పడ్డాం. రాయితీ విత్తనం అందకుండా చంద్రబాబు ఈసీకి ఫిర్యాదు చేయించడం దుర్మార్గం. బహిరంగ మార్కెట్లో కొని విత్తన సాగుచేపట్టడం రైతుకు సాధ్యం కాదు. ఎన్నికలు ముగియడంతో రాయితీ విత్తనం అందించేలా ప్రభుత్వం కృషి చేయాలి.

– ఎస్ శివన్న, రైతు, గుమ్మఘట్ట మండలం

సాగులో మెలకువలు పాటించాలి



సాగులో మూసపద్ధతులు పాటించకుండా నూతన శాస్త్ర, సాంకేతిక పద్ధతులను పాటించాలి. ఖరీఫ్ సాగుకు ఇదే అనుకూలమైన సమయం. రైతు ఏ పంట వేయాలనుకున్నా, లోతుగా రెండు లేదా మూడు సార్లు దుక్కులు చేపట్టాలి. పశువుల ఎరువులను ఎక్కువగా వినియోగించుకోవాలి. వీటికి తోడు అధికారుల సలహా, సూచనలు పాటిస్తే మంచి దిగుబడి సాధ్యమౌతుంది.

– యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

సేంద్రియ పద్ధతుల్లోనే సాగు చేయాలి



వేసవి దుక్కులు పూర్తయ్యాక రైతులు పొలంలో పేడ ఎరువులు ఎక్కువ శాతం వేసుకోవాలి. సాగులో సేంద్రియ పద్ధతులను అవలంబిస్తేనే మంచి దిగుబడులు సాధ్యమౌతాయి. రైతుకు అవసరమయ్యే విత్తన ప్రణాళిక చేపట్టాం. చీడ, పీడల నివారణతో పాటు నేల సాంద్రత పెంచుకునేలా రైతులు కృషి చేయాలి. ఏ అవసరం వచ్చిన తమ సిబ్బందిని సంప్రదించాలి.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

ఓటర్లలో చైతన్యం.. పెరిగిన పోలింగ్ శాతం



ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు

కూడేరు: 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడేరు మండలంలో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. ఓట్లు వేసేందుకు ఉదయం 7 గంటల నుంచే బారులు తీరడం విశేషం. మొత్తం ఓటర్లు 32,264 మంది ఉండగా, 29,117 పోలైన ఓట్లు పోలయ్యాయి. మండలంలో గ్రామాల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
కూడేరు	3,713	3,107
ఎంఎం హళ్లి	810	769
పి.నారాయణపురం	1,601	1,453
కరుట్లపల్లి	1,763	1,586
శివరాంపేట	632	599
ఉదిరిపికొండ	1,242	1,170
జల్లిపల్లి	1,912	1,652
మరుట్ల-1వ కాలనీ	952	866
మరుట్ల-2వ కాలనీ	855	790
మరుట్ల-3వ కాలనీ	1,055	988
కలగ్ల	1,463	1,370
కొర్రకోడు డ్యాం	493	429
కొర్రకోడు	2,245	2073
ముద్దలాపురం	1,605	1,443
ఇప్పేరు	1,409	1,215
పి.నాగిరెడ్డి పల్లి	89	913
అంతరగంగ	802	733
అరవకూరు	1,253	1,147
కమ్మూరు	1,718	1,580
గొటుకూరు	1,939	1,729
జయపురం	571	552
చోళసముద్రం	1,775	1,641
కదదరకుంట	779	705

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- సమావేశంలో విద్యుత్‌శాఖ ఏడీఏ రంగస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఏడీఏ రంగస్వామి తదితరులు

వజ్రకరూరు: మరికొన్ని రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏడీఏ రంగస్వామి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యుత్‌శాఖ ఏడీఏ రంగస్వామి మాట్లాడుతూ వర్షాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అలర్ట్‌గా ఉండాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ షెక్షావలి, ఎల్ఐలు బాలరాజు, లోక్‌పాల్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



వైఎస్సార్‌సీపీ కార్యకర్త బసప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మఠం బసవప్ప (50) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎంపీపీ కరణం పుష్పావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం భీంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఓబుళేసు, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్యాపిలి నాగరాజు, షన్ముఖగౌడు, డిష్ వెంకటేశులు, రాజశేఖర్, సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు, ప్రసాదు, బుడ్డే ప్రసాదు, సిద్దప్పగౌడు, పొట్లి సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 3వ తరగతిలో ప్రవేశాలకు 4,5,6,7,8,9 వ తరగతిలో బ్యాక్‌లాగ్ కింద ఖాళీ సీట్ల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థులు సంబంధిత పాఠశాలలో మే20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9963205664, 6302846353లో సంప్రదించాలన్నారు.

సృజనాత్మకత పెంపొందించేందుకే విలువల బడులు

కుందుర్పి: విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక, నైతిక విలువలు పెంపొందించేందుకు విలువల బడులు ఎంతో దోహదపడుతాయని సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు లెనిన్‌బాబు సూచించారు. రెండు రోజులుగా మండలంలోని 18 గ్రామాల్లో విలువల బడులను ప్రారంభించారు. వేసవి సెలవుల్లో ఉదయం బాషా సామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సాయంత్రం సమయాల్లో కథలు, చిత్రలేఖనం, ఆటలు, పాటలు నేర్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని వైఎస్సార్‌సీపీ నేత మెట్టు విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం నియోజకవర్గంలోని పలు గ్రామాలను ఆయన సందర్శించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ సరళి, పార్టీకి వచ్చే మెజార్టీపై ఆరా తీశారు. ఈ సదర్భంగా మెట్టు విశ్వ మాట్లాడారు. నియోజకవర్గం లోని మెజార్టీ మహిళా ఓటింగ్ శాతం వైఎస్సార్‌సీపీ కి కలిసొచ్చిందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఫ్యాన్ ప్రభంజనం సృష్టించిందన్నారు.త్వరలో విడుదలయ్యే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఫ్యాన్ సునామి సృష్టిస్తోందన్నారు. జూన్ 4 తర్వాత రాయదుర్గం కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరబోతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

గుమ్మఘట్ట: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గౌరిదేవి ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆమె మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. నీటి వసతి లేకపోతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరాఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

భారీగా పెరిగిన చికెన్ ధర

- రూ.250 ధరతో బెంబేలెత్తుతున్న వినియోగదారులు



బ్రాయిలర్ కోళ్లు

రాయదుర్గంటౌన్: బంధువులు వస్తేనే చికెన్..లేదంటే పప్పు అన్నంలా మారింది చికెన్ ప్రియుల పరిస్థితి. వాస్తవానికి వేసవిలో ఎండ వేడిమి కారణంగా కోడి మాంసాన్ని తినేందుకు ఒకింత వెనకడుగు వేస్తారు. దీనివల్ల వేసవిలో చికెన్ కొనుగోలు తగ్గి, ధరలు కూడా అమాంతం తగ్గిపోయేవి. ఈసారి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. చికెన్ ధరలు తగ్గే మాట కనిపించడం లేదు. నెలరోజుల క్రితం రూ.200 ఉన్న కేజీ చికెన్ ధర ప్రస్తుతం రూ.250 కొనసాగుతోంది. నియోజకవర్గంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు వంద దాకా కోళ్ల ఫారాలు ఉన్నాయి. తీవ్రమైన వేసవికి కోళ్లు మృతి చెందుతుండడంతో ఉత్పత్తి తగ్గి ధర అమాంతం పెరిగినట్లు పేర్కొంటున్నారు. మండుటెండలకు బ్రాయిలర్ కోళ్లు పెరగకుండానే చనిపోతున్నట్లు వ్యాపారులు తెలిపారు. వేసవి తగ్గుముఖం పడుతున్నా, కోళ్ల ఉత్పత్తి ఆశించిన మేర లేక ధరలు తగ్గడం లేదు. స్థానికంగా కోళ్ల సరఫరా లేకపోవడంతో కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల్లోని ఫారాల నుంచి కోళ్లు సరఫరా అవుతున్నాయి. రవాణా సమయంలో కూడా అనేక కోళ్లు మృత్యువాత పడుతున్నట్లు చెబుతున్నారు. కోళ్ల ఉత్పత్తి పెరిగి వరకు ధరలు ఇలానే కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు చెప్తున్నారు.

20 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం కోటలో వెలసిన పట్టణానికే తలమానికం ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు మే 20 నుంచి 30 వరకు జరుగుతాయని గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి తెలిపారు. వందేళ్ల నుంచి కొనసాగుతున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా 25న తొమ్మిదేళ్ల బాలికతో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 27న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం జరగనుంది.

శ్రీవారి ఉత్సవ కార్యక్రమాలు:

ప్రసన్న వెంకటరమణస్వామి ఉత్సవాల్లో భాగంగా మే 20న కలశస్థాపన, రక్షాబంధనం, 21న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ వాహనం, 23న శ్రీవారి శేష వాహనోత్సవం, 24న హనుమద్ వాహనం, 25న కల్యాణోత్సవం, గరుడ వాహనోత్సవం, 26న గజేంద్ర వాహనం, 27న మడుగు తేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం, 28న పార్వేటోత్సవం, అశ్వ వాహనం, బాణసంచా వేడుక, 29న వసంతోత్సవం, మయూర వాహనం, 30న సప్తశయనోత్సవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

నేడు శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలసిన లక్ష్మీనారాయణస్వామి వార్షిక కళ్యాణోత్సవం, శ్రీవారి రథోత్సవ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప, అధ్యక్ష, కార్యదర్శులు గెల్లి రామరాజు, రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి దాకా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 11:30 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు శ్రీవారి గరుడసేవ (రథోత్సవం) జరుగుతుందన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవం భక్తులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే డెంగీ నివారణ



మాట్లాడుతున్న మండల వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి



గుమ్మఘట్టలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



కుందుర్పిలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది



ఉద్దేహాళ్‌లో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



కణేకల్లులో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కూడేరు: ప్రజలు డెంగీ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలిపారు. గురువారం జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బంది కూడేరు గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ డెంగీ పగటి పూటకుట్టే దోమ ద్వారా వస్తుందన్నారు. సూపర్ వైజర్లు రవీంద్ర, యశోధ, ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, స్టాఫ్ న ర్సు భువనేశ్వరి, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: డెంగీని తరమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్, బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని పీహెచ్‌సీ కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ప్రాణాంతరకమైన డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏడిస్ దోమకాటు వల్ల వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏలీసా పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారించొచ్చన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు, జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాంకిశోర్, సీహెచ్ఓ మురళీధర్, ఏఎన్ఎంలు, ఎంల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమ కాటుతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు అనూషా, నారాయణస్వామి, సిబ్బంది మధు, మమత, సుధాలక్ష్మి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు రావని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, గీతాభార్గవి అన్నారు. గురువారం మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాల్లో జాతీయ డెంగీ దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ దోమలను తరిమికొడితే మలేరియా, డెంగీ, విషజ్వరాలు రావన్నారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాలు, మురుగు గుంతలను శుభ్రం చేసుకోవాలని, మురుగు గుంతల్లో వేస్ట్ ఆయిల్ చల్లి దోమలు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విశ్వనాథ్‌రెడ్డి, విజయభారతి, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, విడపనకల్లు, పెద్దకొట్టాలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని జాతీయ డెంగీ నివారణ దినోత్సవంపై మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ చేశారు. ఉరవకొండలో మెడికల్ ఆఫీసర్ గంగాధర్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది ఏఎన్ఎం శ్రావణి, ఆరోగ్య సిబ్బంది శివలక్ష్మి, నూర్, ప్రమీలదేవి, పుష్ప పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కణేకల్లు: దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నేషనల్ డెంగీ డే సందర్భంగా డాక్టర్లు, ఆశ వర్కర్లు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం ఏర్పాటైన సభలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడారు. డెంగీ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స అంటూ ఏదీ లేదన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు నిరీషా చంద్రశేఖర్‌నాయక్, మహేంద్ర, పావని, షరీఫ్, హెల్త్ అసిస్టెంట్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

22న మండల సమావేశం

రాయదుర్గం రూరల్: ఈ నెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లా, మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE 2nd ADDL. SR. CIVIL JUDGE AND ADDL. MACT., AT TUMAKURU

MVC No. 502/2022

Claimants: Lakshminarasamma & ors.
V/s
Respondents: Srinivasareddy & anr.

Paper Publication

To, Srinivasareddy, son of Venkatareddy, Aged about 45 years, residing at No. 4/96/D, LB Nagara, Bommanal Mandal, Rayadurga S.O., Ananthapuramu District, Andhra Pradesh State - 515 865.

NOTICE TO R-1

Whereas, the claimants have filed the above compensation against you being the owner of the Eicher bearing Regd. No. AP02TE2179, which is involved in road traffic accident, due to death of one Rajashekhara.

Hence, you are hereby directed to take Notice and appear before the court by person or through counsel **at 11 A.M. on 01-07-2024** and to file objections if any. If you have not appeared the matter will be decided in your absence, placing you As ex-parte.

Given under my hand and seal of this Court, this the 15th day of April, 2024

(By Order of the Court)

R. Pathanna Advocate for Claimants Date : 06-02-2024	Chief Ministerial Officer Senior Civil Judge, Tumakuru.